వాష్‌రూమ్‌లో యువతి ఫొటోలు తీసేందుకు యత్నం

● గుర్తించి కేకలు వేసిన యువతి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున వాష్‌రూమ్‌కు వెళ్లిన ఓ యువతి ఫొటోలు తీసేందుకు ఓ ఆగంతకుడు ప్రయత్నించాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధురానగర్ కాలనీ ప్రధాన వీధిలోని మోర్ సూపర్‌మార్కెట్ సమీపంలో ఉన్న హరేలియా హాస్టల్‌లో కొంత మంది యువతులు నివాసముంటున్నారు. ఈనెల 28వ తేదీ తెల్లవారుజామున ఓ యువతి వాష్‌రూమ్‌కు వెళ్లింది. అదే సమయంలో గుర్తు తెలియనివ్యక్తి వెంటిలేటర్ నుంచి ఫొటోలు, వీడియోలు తీసేందుకు యత్నించాడు. ముందుగానే గుర్తించిన ఆ యువతి కేకలు వేయగా ఆ ఆగంతకుడు పారిపోయాడు. హాస్టల్ మొదటి అంతస్తులోని వారు కారనీ, హాస్టల్ పక్కనే ఉన్న హోటల్‌లో పనిచేసేవారు ఈచర్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది.

పెళ్లి చేసుకుంటానని మోసం.. వ్యక్తి అరెస్ట్

ఖైరతాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిని ఖైరతాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... కర్నూలు జిల్లా బేతంచర్ల మండలం ముద్దవరం గ్రామానికి చెందిన మధు శివుడు(28) ఓ ప్రైవేట్ ఛానెల్‌లో పని చేస్తుండగా అందులోనే పనిచేస్తున్న ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. తీరా పెళ్లి గడువు రానే వచ్చింది. మరో గంటలో పెళ్లి ఉందనగా మధుశివుడు పారిపోవడంతో పెళ్లి ఆగిపోయింది. దీంతో బాధితురాలి కుటుంబీకులు నిలదీయడంతో తనకు సంవత్సరం క్రితమే మరదలితో పెళ్లయిందని తెలపడంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కర్నూలుకు వెళ్లి అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ప్రేమించి వదిలేసి.. పెళ్లి చెడగొట్టేందుకు యత్నం

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రేమించానని ఏడాది పాటు తిరిగి వదిలేశాడు. ఇప్పుడు పెళ్లి చెడగొట్టేందుకు సిద్ధమైన యువకుడిపై యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... జవహర్‌నగర్‌లో నివసించే యువతి యూసుఫ్‌గూడలో డైలీ లేబర్‌గా ఉండే హేమంత్ 2021లో ప్రేమించుకున్నారు. వీరు ఏడాది పాటు స్నేహంగా ఉన్నారు. తరువాత ఆమెను వదిలేశాడు. ఆమె తల్లిదండ్రులు త్రినాథ్ అనే వ్యక్తితో పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసిన హేమంత్ ఈనెల 28వ తేదీన త్రినాథ్‌కు ఫోన్ చేసి వారిద్దరి ఫొటోలు చూపించి పెళ్లి చేసుకుంటే మర్యాదగా ఉండదని, ఈ ఫొటోలు వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో ఆ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


హేమంత్ (ఫైల్)

అమీర్‌పేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓయో హోటల్‌లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం రాత్రి 2 గంటల ప్రాంతంలో ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలను ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన హేమంత్(28) వ్యాపారి. అదే గ్రామానికి చెందిన ఓ యువతి, హేమంత్ కొద్ది కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురు కలిసి హైదరాబాద్‌లోని ఓ శుభకార్యానికి హాజరై అనంతరం ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓయో హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న మద్యం తాగి హేమంత్ రాత్రి 2 గంటల ప్రాంతంలో బాత్‌రూంకు వెళ్లి ఎంతకి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి సదరు యువతి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే తన సోదరుడు వంశీకృష్ణ, స్నేహితులకు ఫోన్ చేసి చెప్పింది. హేమంత్‌ని మంచంపై పడుకోబెట్టి 108కు ఫోన్ చేయగా, సిబ్బంది వచ్చి పరిక్షించి హేమంత్ మృతి చెందినట్టు చెప్పారు. మృతుడి తల్లి హేమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెళ్లేందుకు దారి ఇవ్వమన్నందుకు దాడి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై అడ్డంగా నిలబడి ముచ్చట్లు చేస్తూ వెళ్లడానికి దారి ఇవ్వమన్నందుకు దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... రెహ్మత్‌నగర్‌లో ఉండే కె.భరత్ స్థానిక చేపల మార్కెట్‌లో వ్యాపారి. ఈనెల 29వ తేదీ రాత్రి భరత్ తన బార్యను డ్యూటీ నుంచి ఇంటికి తీసుకెళ్తుండగా వీడియో గల్లీ రోడ్డు మధ్యలో నిలిబడి కొందరు ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. తమ ద్విచక్రవాహనం వెళ్లేందుకు దారి ఇవ్వమని భరత్ బార్య అడిగింది. దీంతో వారు మహిళ అని కూడా చూడకుండా దుర్భాషలాడారు. దీంతో భరత్ ఇదేమిటని అడగడంతో భరత్‌పై దాడి చేసి చితకబాదారు. దీంతో భరత్‌ను ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించిన భార్యా మధురానగర్ పోలీసులకు జాయ్‌సన్, యశ్వంత్ మరికొందరిపై ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ గదిలోని లాకర్‌లో ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హోటల్ గదిలోని లాకర్ ఉన్న ఆభరణాలు చోరీకి గురయ్యాయి. తమిళనాడు రాష్ట్ర మధురైకి చెందిన మెహ్రాన్ ఇస్మాయిల్ వ్యక్తిగత పని మీద నగరానికి వచ్చి బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూలో ఉంటున్నారు. ఈ నెల 27న తన ఆభరణాలను లాకర్‌లో పెట్టి టిఫిన్ చేయడానికి బయటకొచ్చారు. తిరిగి వచ్చేసరికి తన అనుమతి లేకుండానే సిబ్బంది గదిని శుభ్రం చేశారు. బయటకు వెళ్లేందుకు లాకర్ తెరవగా అందులో రూ. 40 వేలు విలువ చేసే ఆభరణాలు కనిపించలేదు. హోటల్ సిబ్బందిని అడగగా వారు స్పందించలేదు. మెహ్రాన్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేస్తున్న హోటల్ నుంచి రూ. 90 వేలు చోరీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న సంస్థ నుంచి రూ. 90 వేలు చోరీ చేసి పారిపోయిన ఉద్యోగిపై కేసు నమోదైంది. ఖైరతాబాద్ ప్రేమనగర్‌లో ఉన్న అబ్సల్యూట్ బార్బిక్యూలో పది రోజుల క్రితం ఒడిశాకు చెందిన ప్రకాష్ నాయక్ క్యాషియర్‌గా చేరాడు. అతడికి బార్బిక్యూలోనే గదిని కూడా ఇచ్చారు. ఈనెల 29 నుంచి అతను కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా ప్రకాష్‌నాయక్ కౌంటర్‌లో ఉన్న రూ. 90వేలు తీసుకొని పారిపోయినట్టు తేలింది. హోటల్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు వెళ్లొచ్చేలోగా నగదు, నగలు చోరీ

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి వెళ్లొచ్చేలోగా ఇంట్లోని నగదు, నగలు చోరీ అయ్యాయి. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రహ్మత్‌నగర్‌లో నివాసముండే శివాని, ఆమె భర్త రాజేష్, అత్త జయలక్ష్మి ఈనెల 29న ఉదయం విధులకు వెళ్లారు. మధ్యాహ్నం శివాని, జయలక్ష్మి కలిసి ఇంటికి వచ్చి చూడగా అల్మారా తెరచి ఉంది. అందులోని 3జతల చెవి రింగులు, 1.5 తులాల చైన్, రూ. 2వేల నగదు కనిపించలేదు. దీంతో శివాని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో...

రహ్మత్‌నగర్‌కు చెందిన లక్ష్మి ఇంట్లో పెట్టిన రూ. 6 వేలు నగదు, ఆఫీసు పేపర్లు దొంగలు తీసుకెళ్లారు. లక్ష్మి విధులకు వెళ్లొచ్చి చూడగా దొంగలు పడినట్టు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

నిమ్స్‌లో పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

సనత్‌నగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఘనంగా వీడ్కోలు పలికారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను డాక్టర్ బీరప్ప సన్మానించి, వారి సేవలను కొనియాడారు. పదవీ విరమణ చేసిన వారిలో నాలుగో తరగతి ఉద్యోగిని గడ్డం విమల, సీనియర్ పర్సనల్ సెక్రటరీ డేవిడ్ రాజు, సీనియర్ సెక్రటరీ అసిస్టెంట్ (వీఆర్ఎస్) టి.విజయలక్ష్మి, టీపీఎస్‌ఆర్‌కే శర్మ, హెడ్‌నర్సు అరుణపవలూరి, పార్వతి చిలువూరి, షేక్ బషీర్ అహ్మద్ ఉన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ డాక్టర్ శాంతివీర్, డాక్టర్ తేజ, డాక్టర్ నాగేశ్వరరావు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


గడప గడప ప్రచారంలో దానం నాగేందర్, కోట నీలిమ తదితరులు


ప్రచారానికి భారీగా హాజరైన కార్యకర్తలు, ప్రజలు

కాంగ్రెస్ విజయం ఖాయం

● సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

సనత్‌నగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ప్రచారంలో భాగంగా దానం నాగేందర్ మంగళవారం సనత్‌నగర్ డివిజన్‌లో గడప గడపకు పాదయాత్ర నిర్వహించి, ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరారు. మతతత్వ బీజేపీ, అవినీతి బీఆర్ఎస్‌ల పాలనలో ప్రజలు అవస్థలు పడ్డారని, ఈ సారి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని దానం నాగేందర్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేయాలని సూచించారు. 10ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, నిరుద్యోగం గతంలో ఎప్పుడూ లేనంతగా పెరిగిందన్నారు. రైతుల ఆదాయం డబుల్ చేస్తానన్న బీజేపీ, రైతు చట్టాలు తీసుకొచ్చి రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తే, రైతులు దాన్ని అడ్డుకున్నారని గుర్తు చేశారు. పాదయాత్రలో సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, డాక్టర్ రవీందర్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నరేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయాను

బంజారాహిల్స్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో ఉండగా కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు కూడా ఇప్పించుకోలేక పోయానని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఫిలింనగర్ 18బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ఆధ్వర్యంలో వివిధ బస్తీలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, దీపా, గోపాల్ నాయక్‌తో పాటు సుమారు 300 మంది దానం సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్‌లో ఉండగా స్వేచ్ఛ కోల్పోయానని, కాంగ్రెస్‌లోకి రాగానే స్వేచ్ఛ లభించిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, కాంగ్రెస్ మరింత బలోపేతం చేసేందుకే తాను పార్టీలో చేరానని చెప్పారు. ఢిల్లీలో సోనియాగాంధీ కార్యాలయం నుంచి ఆదేశాలు అందడంతో ఎంపీగా పోటీ


దానం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సుధాకర్‌రెడ్డి, మహిళలు

చేస్తున్నట్టు తెలిపారు. తాను ఎప్పుడు పోటీ చేసినా ఖైరతాబాద్ ప్రజలు అండగా ఉన్నారని, ఇప్పుడు కూడా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. తన కోసం కష్టపడే వారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఇచ్చేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావుకు ఈ సారి కార్పొరేటర్ టికెట్ కాకుండా, కార్పొరేషన్ లేదా ఎమ్మెల్సీ పదవి ఇప్పించనున్నట్టు ప్రకటించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కడికి వెళ్లినా తనకు తగిన ఆదరణ లభిస్తుందని, వర్గాల వారీగా ప్రజలు తనకు ఓటు వేసేందుకు మొగ్గు చూపిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తాను విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తా

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా బాకారం బొమ్మలగుడిలో పూజలు చేసి జీపు యాత్ర చేస్తూ పలు బస్తీల్లో ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. రిసాలగడ్డ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై నమ్మకంతో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గెలిచి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానన్నారు. అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌ల మోసపూరిత మాటలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు.


రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మర్యాద పూర్వకంగా కలిసిన సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, సీనియర్ నాయకుడు మామిడి నర్సింగరావు
- బంజారాహిల్స్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి)

పీవో, ఏపీవోలకు చివరి శిక్షణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా అధికారులు పోలింగ్ ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. ఇప్పటికే ఓ విడత ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి శిక్షణ శిబిరాలు పూర్తికాగా, ప్రస్తుతం పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను కేటాయించడంతో ఖైరతాబాద్ నియోజకవర్గ పీవో, ఏపీవోలతో పాటు వారికి చేదోడుగా ఉండే సెక్టోరియల్ అధికారులకు విడతల వారీగా ఖైరతబాద్ చింతలబస్తీ డిగ్రీ కళాశాలలో చివరి శిక్షణ ఇచ్చారు. ఇందులో మాస్టర్ ట్రైనర్లతో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఏఆర్వో, జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖాడే, సర్కిల్ 18 డీసీ ప్రశాంతి శిక్షణ ఇచ్చారు. ఈసారి పార్లమెంట్ స్థానానికి 45 మంది అభ్యర్థులతో పాటు నోటా ఉండడంతో మూడు ఈవీఎంలను వినియోగించాల్సిన పరిస్థితులు రావడంతో పీవో, ఏపీవోలు జాగ్రత్త వహించాలని సూచించారు. గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలని, ఓటు వేసినట్టు సిరాను వేయాలని తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉన్న మొత్తం 600 మంది పీవో, ఏపీవో, సెక్టార్ అధికారులకు మంగళవారం రెండు విడతల్లో 300 మందికి శిక్షణ పూర్తవగా మరో 300 మందికి బుధవారం ఉంటుందని ఖైరతాబాద్ ఈఆర్వో ప్రశాంతి తెలిపారు.

'ఓటు హక్కును వినియోగించుకోవాలి'

ఎర్రగడ్డ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ సేవానాయక్ సూచించారు. మంగళవారం ఎర్రగడ్డ రాజీవ్‌నగర్‌లోని స్థానికులకు ఓటర్ సమాచార పత్రాలతో పాటు ఓటర్లకు సంబంధించిన ఓటర్ గైడ్ పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటును వినియోగించుకోవడం ప్రాథమిక హక్కుగా భావించి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వీరగిరి చైతన్యతో పాటు కాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు పీఎస్టీ కృష్ణ శర్మ, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినయసాగర్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే మద్దతు

● మందకృష్ణ, మోత్కుపల్లి మాదిగ జాతికి చీడ పురుగులు
● తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి


అభివాదం చేస్తున్న తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి నాయకులు

పంజాగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే మాదిగ సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి ప్రకటించింది. వర్గీకరణ ఉద్యమం పేరుతో మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా మాదిగలను మోసం చేశారని, ఆయనతో పాటు మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాదిగల ద్రోహులు, చీడ పురుగులని మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ కుమార్ మాదిగ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ ప్రధాన సలహాదారులు సంగీతపు రాజలింగం, మాస్టర్జీ, ప్రధాన కార్యదర్శి దేశపాక నర్సింహ మాదిగ, మల్లు శివరాం, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. తాము కేంద్రంలో అధికారంలోకొస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ పదేళ్లు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. తమను వంచించి, మభ్యపెట్టి మోసం చేసిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మాదిగల శత్రువు అని బూచి చూపిస్తున్నారని, కాంగ్రెస్ మాదిగల శత్రువు కాదని మంద కృష్ణ తెలుసుకోవాలని అన్నారు. మల్లు కుటుంబాన్ని విమర్శించే స్థాయి ఆయనది కాదని మల్లు అనంతరాములు కుమారుడు మల్లు శివరాం అన్నారు. సమావేశంలో కమిటీ నాయకులు గ్యార శ్రీనివాస్, మల్లన్న, మోహన్, సుధాకర్, చైతన్య, బి.యాదగిరి, భాగ్యలక్ష్మి, పూజ మాదిగ పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం


మాట్లాడుతున్న పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి ప్రొఫెసర్ శ్రీనివాస్

పంజాగుట్ట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ప్రొఫెసర్ పంతుకాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ... నిస్వార్థంగా ప్రజా సేవ చేసే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలిచామన్నారు. దేశానికి దిశా నిర్దేశం చేయాల్సిన నాయకులు పూటకో పార్టీ మారతుండడం ప్రజలను విస్మయానికి గురి చేస్తుందని అన్నారు. అధికారమే లక్ష్యంగా దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలు సైతం అడ్డగోలుగా హామీలు గుప్పిస్తున్నారని అన్నారు. పారదర్శకంగా జరగాల్సిన ఎన్నికలను నోట్ల మాయం చేసి గెలిచిన అనంతరం దేశ సంపదలను దోచుకుంటున్న వారిపట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని కోరారు. దేశంలో గతంలో ఎన్నడు లేని విధంగా ఒక పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేసి చివరి క్షణంలో నామినేషన్ ఉపసంహరించుకోవడమే కాక ప్రత్యర్థి పార్టీలోకి మారడం ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియపై విరక్తి చెందిన ప్రజలు ఓటింగ్ సైతం ఆసక్తి చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివి ప్రజా సేవే లక్ష్యంగా పెద్దపల్లి నుంచి పోటీ చేస్తున్న తనతో పాటు స్వతంత్రులుగా పోటీ చేస్తున్న వారిని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యావంతులను, నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్న వారినే ఎన్నుకోవాలన్నారు. సమావేశంలో బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వేల్పుల సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో 'శ్రీనిధీస్ గౌతమ్' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని రాఖీపాల్‌కు ట్యూషన్ ఫీజు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్లు సుకుమార్, కృష్ణవేణి

వెంగళరావునగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో సంజీవరెడ్డి నగర్‌లోని శ్రీనిధీస్ గౌతమ్ విద్యాలయ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి ఫలితాలు సాధించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల, మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్, స్వీట్ ఏంజిల్ స్కూల్ డైరెక్టర్లు సుకుమార్, కృష్ణవేణి, కొల్లి లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించారు. రాఖీ పాల్(10 జీపీఏ) సాధించింది. నాగచైతన్య, ఎం.యశస్విని, కె.జయశ్రీ, రాంచరణ్, ప్రణయ్, రాహుల్ గౌడ్‌తో పాటు పలువురు విద్యార్థులు ఎనిమిదికి పైగా జీపీఏ సాధించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్లు మాట్లాడుతూ... పాఠశాల విద్యార్థులు గడిచిన కొన్ని సంవత్సరాలుగా మంచి మార్కులు సాధిస్తూ తమ ప్రత్యేకతను చాటుతున్నారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పది జీపీఏ సాధించిన విద్యార్థి రాఖీ పాల్‌కు ఆమె కట్టిన ట్యూషన్ ఫీజును తిరిగి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జ్యోత్స్న, కె.గీత,వైస్ ప్రిన్సిపాల్ విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నియోనాటల్ రిసుసిటేషన్‌పై ప్రత్యేక వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యులు, నర్సులు

నవజాత శిశు మరణాలను తగ్గించాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నవజాత శిశు మరణాలను తగ్గించాల్సిన అవసరం ఉందని విరించి ఆస్పత్రి పీడియాట్రిషియన్ డాక్టర్ వన్నాల రాజు తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఆస్పత్రిలో మంగళవారం నర్సింగ్ సిబ్బంది కోసం నియోనాటల్ రిసుసిటేషన్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుట్టిన వెంటనే ఆక్సిజన్ లేకపోవడం వల్ల (హైపోక్సిక్ ఇస్కీమిక్ ఎన్‌సెఫలోపతి 8 హెచ్‌ఐఈ) మెదడు దెబ్బ తింటుందన్నారు. ఇది సాధారణం అయినప్పటికీ, నివారించొచ్చన్నారు. దేశంలో ప్రస్తుతం నవ జాత శిశు మరణాల రేటు ప్రతి వెయ్యి మందిలో సుమారు 20 మరణాలు ఉన్నాయని తెలిపారు. వీటిని తగ్గించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైపోక్సిక్ ఇస్కీమిక్ ఎన్సెఫలోపతి(హెచ్ఐఈ) వంటి పరిస్థితులు కారణంగా శిశువు పుట్టిన వెంటనే ఊపిరి పీల్చుకోలేక పోవటం వల్ల నియోనాటల్ మరణాలకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కిమ్స్ కడిల్స్ డాక్టర్ పూర్ణ గుగ్గిలం, రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి డాక్టర్ వద్ది వంశీ కృష్ణ పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య విలువలను కాపాడుతం'

పంజాగుట్ట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలను కాపాడడమే కాకుండా అందరికీ ఉచిత విద్య, వైద్యం అందిస్తామని విద్యార్థుల రాజకీయ పార్టీ అధ్యక్షుడు వైసునీల్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను ఆయన పరిచయం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 50 స్థానాల్లో పోటీ చేయగా, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆరు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నామని, ఎన్నికల సంఘం బ్యాట్ గుర్తు కేటాయించిందని అన్నారు. పాతబస్తీని షాహీన్‌నగర్‌గా చేస్తామని అన్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, తమను ఆదరించాలని ఆ యన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ లుబ్నా సార్వత్, నిజామాబాద్ అభ్యర్థి భూక్య నందు, మల్కాజిగిరి అభ్యర్థి సుఖేందర్ రెడ్డి, సికింద్రాబాద్ అభ్యర్థి ఆదం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీలో ఫైన్ ఆర్ట్స్ శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో శిల్పం, చిత్రలేఖనం శాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవులలో ఫైన్ ఆర్ట్స్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెయింటింగ్స్, శిల్పం, ప్రింట్ మేకింగ్ కోర్సుల్లో ఆసక్తిగల విద్యార్థులకు 45 రోజులపాటు శిక్షణా తరగతులను నిర్వహించి సర్టిఫికెట్ ఇస్తామని, మే 8 నుంచి ప్రారంభించే కోర్సుకు రూ.6వేల ఫీజును చెల్లించాల్సి ఉంటుందని, సంబంధిత డిమాండ్ డ్రాఫ్టును రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరిట చెల్లించాలని తెలిపారు. వివరాలకు 8309011865, 8309498807లను సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎర్రగడ్డ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నవీన్ చంద్రారెడ్డి రోగులకు ఉచిత వైద్య సలహాలు ఇచ్చారు. దాదాపు 200మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నీలిమ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, నీలిమ ఆస్పత్రి వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ వ్యాపారులకు దేశం తాకట్టు

● జస్టిస్ చంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్ర కుమార్

పంజాగుట్ట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గుజరాత్ వ్యాపారులకు లాభం చేకూర్చడానికే దేశాన్ని తాకట్టు పెడుతున్నారని జస్టిస్ బి.చంద్రకుమార్ ఆరోపించారు. అవినీతి పరులను పార్టీలో చేర్చుకుని, వారిపై ఉన్న కేసులను రద్దు చేసి, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని అంటున్నారని ఆయన అన్నారు. సెక్యులర్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్డీఎఫ్), ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి(పీపీఎస్)ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చేందుకు అన్ని ప్రజాతంత్ర, లౌకిక శక్తులతో సంయుక్తంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. దేశంలో అన్నిటి ధరలు పెంచిన సామాన్యులను, రైతాంగాన్ని దోచుకుని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. సామాన్యులపై పన్నులను 30 శాతానికి పెంచి, కార్పొరేట్ సంస్థలపై పన్నులు తగ్గించి పేదల పొట్ట కొడుతున్నారని, తమ వద్ద లెక్కలు ఉన్నాయని అన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం హిందువులకు అన్యాయం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్య, వైద్యాన్ని వ్యాపారం చేస్తూ సామాన్యులకు వాటిని దూరం చేస్తున్నారని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో దేశంలో పలు ప్రాజెక్టులు వచ్చాయని, ప్రభుత్వ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఏర్పాటు అయ్యాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వం చేసింది ఏమి లేదని అన్నారు. అవినీతిపరులను పార్టీలో చేర్చుకుని, వారిపై ఉన్న కేసులు రద్దు చేసి, తాము అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని అమిత్ షా చెబుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచుదామని, పట్టణ ప్రాంతాలు, హైదరాబాద్ మహానగరంలో ఉన్న ఓటర్లు అందరూ తప్పకుండా ఓటు హక్కును సద్వినియోగించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, హక్కులను కాపాడుకోవాలన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, సొగరా బేగం, సినీ దర్శకులు రఫీ, కె.శ్రీనివాస్, సూర్యకిరణ్, భద్ర,స్నేహ రెడ్డి,డాక్టర్ ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 24 మంది అధికారులను మంగళవారం కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించిన సిటీ పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ అధికారులు
- హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి)



రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తా

కాంగ్రెస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్


ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రచారంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా బాకారం బొమ్మలగుడిలో పూజలు చేసి జీపు యాత్ర చేస్తూ పలు బస్తీల్లో ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. రిసాల గడ్డ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై నమ్మకంతో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సికింద్రాబాద్‌లో గెలిచి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానన్నారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తన గెలుపునకు దోహదపడతాయని అన్నారు. అంజన్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మోసపూరిత మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలు, హక్కుల కోసం పాటుపడే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు దానంకు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని సూచించారు. ప్రచారంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనా యాదవ్, వాజిద్ హుస్సేన్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ జుహేర్ హుస్సేన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిలు కె.గౌరీశంకర్, పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

సనత్‌నగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయమని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. మంగళవారం సతన్‌నగర్ డివిజన్ ఆయన ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. మతతత్వ బీజేపీ, అవినీతి బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. 10 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ హయాంలో పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, నిరుద్యోగం గతంలో ఎప్పుడూ లేనంతగా పెరిగిందన్నారు. రైతుల ఆదాయం డబుల్ చేస్తానన్న బీజేపీ, రైతు చట్టాలు తీసుకువచ్చి వారిని మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, డాక్టర్ రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నరేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సనత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న దానం నాగేందర్

బీఆర్‌ఎస్‌లో ఉండగా స్వేచ్ఛ కోల్పోయా

బంజారాహిల్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌లో ఉండగా కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు కూడా ఇప్పించుకోలేకపోయానని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ఆధ్వర్యంలో పలు బస్తీలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, దీపా, గోపాల్‌నాయక్‌తోపాటు సుమారు మూడు వందల మంది దానం సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో ఉండగా స్వేచ్ఛ కోల్పోయినట్టు చెప్పారు. ఏడున్నర సంవత్సరాల వ్యవధిలో కేసీఆర్‌ను కలిసింది ఐదుసార్లు మాత్రమేనని, కేటీఆర్‌ను కలిసింది కూడా తక్కువేనని తెలిపారు. కార్యకర్తలకు పార్టీ పదవులు కూడా ఇప్పించలేని పరిస్థితులు ఎదుర్కొన్నట్టు వివరించారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత స్వేచ్ఛ లభించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, కాంగ్రెస్ మరింత బలోపేతం చేసేందుకే తాను పార్టీలో చేరినట్టు చెప్పారు. ఢిల్లీలో సోనియాగాంధీ కార్యాలయం నుంచి ఆదేశాలు అందడంతో ఎంపీగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. తనకోసం కష్టపడే వారికి గుర్తింపు ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావుకు కార్పొరేషన్ లేదా ఎమ్మెల్సీ పదవి ఇప్పించనున్నట్టు ప్రకటించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కడకు వెళ్లినా తనకు ఆదరణ లభిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధిస్తానని దానం ధీమా వ్యక్తం చేశారు.

అడ్డగుట్టలో కిషన్‌రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదు


పద్మారావుకు మద్దతుగా అడ్డగుట్టలో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి


ఇందిరానగర్‌కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు భారీ మెజార్టీతో విజయం సాధిస్తాడని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి అడ్డగుట్టకు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. అడ్డగుట్టలో కిషన్‌రెడ్డికి ఓటు అడిగి హక్కు లేదన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుకు మద్దతుగా అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్, ఇందిరాలక్ష్మీనగర్, వెంకటన గర్, అడ్డగుట్ట పరిసర ప్రాంతాల్లో అడ్డగుట్ట బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ ప్రచారం చేశారు.


పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత


వారాసిగూడలో ఎన్నికల ప్రచారంను నిర్వహిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ తదితరులు

సుస్థిర ప్రభుత్వం కోసం బీజేపీని గెలిపించాలి

● కిషన్‌రెడ్డి

చిలకలగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మెట్టుగూడ రైల్వే వర్క్‌షాపులో మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కిషన్‌రెడ్డి పర్యటించి కమలం గుర్తుకి ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రైల్వే కార్మికులతో మాట్లాడుతూ సుస్థిర ప్రభుత్వ స్థాపన, దేశభద్రతని దృష్టిలో పెట్టుకుని పార్టీని గెలిపించాలని తెలిపారు. 400 సీట్లతో నరేంద్ర మోదీ గెలుపు ఖాయమని, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తనను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, అధికార ప్రతినిధి శారదామల్లేష్, సీనియర్ నాయకుడు బండపల్లి సతీష్, మల్లీశ్వరపు రాజేశ్వరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్డగుట్ట : సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి డివిజన్‌లోని వెంకట్‌నగర్ అడ్డగుట్ట డివిజన్‌లోని పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన కిషన్‌రెడ్డి దేశం కోసం మోదీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మాజీ మేయర్ బండకార్తీకారెడ్డి బీజేపీ సీనియర్ నాయకుడు మేలక సారంగపాణి, బండెపల్లి సతీష్, బీజేవైఎం నేత ఉదయ్ యాదవ్, మహేందర్ పాల్గొన్నారు.


మెట్టుగూడ వర్క్‌షాపులో ప్రచారం చేస్తున్న కిషన్‌రెడ్డి

తార్నాక : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డితో కలిసి లాలాగూడాలోని రైల్వే వర్క్‌షాప్ ఆవరణలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కంటోన్మెంట్‌ను ఎంపీగా రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదు

● మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

బోయినపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీగా గెలుపొందిన నాటి నుంచి రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్ వైపు తిరిగి చూడలేదని, అభివృద్ధిని పట్టించుకోలేదని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నిక నేపథ్యంలో మంగళవారం కంటోన్మెంట్ బోయినపల్లి ప్రాంతానికి చెందిన పద్మశాలి సంఘం తమ మద్దతు బీజేపీకి ఉంటుందని, అందుకే ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపుకోసం కృషిచేస్తామని తెలిపారు. బోయినపల్లి భావన కాలనీలో బండి శ్రీనివాస్ అధ్యక్షతన తమ్మల నాగేందర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశతిలక్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, బీజేపీ నాయకులు బానుక మల్లికార్జున్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయినపల్లి పద్మశాలి సంఘం ప్రతినిధులు తమ పూర్తి మద్దతును బీజేపీకి ఇస్తున్నట్లు ప్రకటించి గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సాయి, రాయల్‌కుమార్, నాగభూషణం, శ్రీనివాస్, అజయ్, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొనారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మౌలాలి : మల్కాజిగిరి నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, కేంద్రంలో మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్ ఇందిరనగర్, బీహార్ బస్తీలలో ఇంటింటికీ ప్రచారం చేపట్టారు.

మల్కాజిగిరి : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాజీ మంత్రి ఈటెల రాజేందర్ మల్కాజిగిరిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో బస్తీబస్తీ తిరుగుతూ ఇంటింటికీ వెళుతూ ముఖిలిత హస్తాలతో ప్రజలను కలుస్తూ, తనకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు.

అల్వాల్ : మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయం ఖాయమని మాజీ కౌన్సిలర్ నిమ్మ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెంకటాపురం డివిజన్ పరిధిలో ఈటలకు మద్దతుగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచిపెడుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్నారు.


గౌతంనగర్ డివిజన్ ఇందిరానగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

నేరేడ్‌మెట్ : నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్‌లో మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశంలో ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


బీజేఆర్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఈటల రాజేందర్

నేడు సర్దార్ పటేల్ కళాశాల వార్షికోత్సవం

పద్మారావునగర్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాల కాలేజ్ డే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించటానికి అన్ని రకాల ఏర్పాట్లను పూర్తిచేసామని కళాశాల పాలక మండలి కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఎంతో చరిత్ర కలిగిన ఎస్‌పీ కళాశాల ఎగ్జిబిషన్ సొసైటీ, ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 1970లో ప్రారంభించారని, ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన ఎంతో మంది ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని తెలిపారు. మే 1 బుధవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో కాలేజ్ డే ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి ముఖ్యఅతిధిగా, ఉస్మానియా పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ టీవీ.గోపాలచారి, కళాశాల పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజేందర్‌లు గౌరవ అతిథులుగా కార్యక్రమానికి హాజరవుతారని తెలియజేశారు.

'రాగిడి'ని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం


కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావు నివాసంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. బీఆర్‌ఎస్ పట్ల ఇప్పటికే ప్రజల్లో ఎంతో సానుభూతితో పాటు విశ్వాసం పెరిగిందని, మళ్ళీ బీఆర్‌ఎస్‌ను ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేష్, జేఏసీ నేత పుల్ల వెంకన్న, ఆర్.అంజయ్య, చిన్నాయాదవ్, నవీన్‌యాదవ్, నరేష్, ఉపేందర్, ప్రభాకర్‌గౌడ్, యామినికుమార్, విజయకుమారి, కవిత, గాయిత్రి, జ్యోతి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో

రామంతాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ చైర్మన్ సర్వబాబు యాదవ్, డివిజన్ అధ్యక్షులు ఎం.డి.ముస్తాక్, జహంగీర్, మహేందర్ ముదిరాజ్, దయాకర్‌రెడ్డి, చాంద్‌పాషా, ఆపిల్ శ్రీను, లింగం, ఆనంద్‌యాదవ్, టోని, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

హబ్సిగూడలో ...

రామంతాపూర్: హబ్సిగూడ వీధి నెంబర్- 8లో వివిధ కాలనీలు, బస్తీలలో బీఆర్‌ఎస్ నాయకులు రాగిడికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

పదేళ్ల అభివృద్ధి చూసి గెలిపించండి

మల్లాపూర్, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి చూసి కారు గుర్తుకే ఓటేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలపించాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఓటర్లును కోరారు. మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మల్లాపూర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు.


టిఫిన్ సెంటర్ నిర్వాహకుడిని ఓటు అడుగుతున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి


మాదిగల సింహగర్జన సభలో మాదిగ సంఘాల నాయకులు

మాదిగలకు టికెట్ ఇవ్వని పార్టీలను తరిమి కొడదాం

● మాదిగ సంఘాల నాయకులు

బోయినపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నికలో మాదిగలకు టికెట్ కేటాయించని పార్టీలను ఎన్నికల ప్రచారం చేయకుండా తరిమికొట్టాలని కంటోన్మెంట్ నియోజకవర్గం మాదిగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వి అండ్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో బుధవారం కంటోన్మెంట్ మాదిగల మహాగర్జన సభ వంశతిలక్, శ్రీకిషన్ మాదిగ, గోపి మాదిగ, శంకర్, అజిత్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గంకు చెందిన మాదిగ సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ఈసారి మాదిగలకు టికెట్ కేటాయించేవరకు ఉద్యమిస్తామని అన్నారు. రాబోయే ఉప ఎన్నికల్లో మాదిగల బలం ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. ఉత్తరయ్య, రొట్టెల సునీల్, శంకర్, రాకేష్, రాజేందర్, మహేందర్, బాలు పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ ఆరోగ్య శిబిరం

చిలకలగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏఐఆర్‌ఎఫ్ సెంచరీ ఉత్సవాలలో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఈడీబీ డివిజన్, బేగంపేట్‌లోని మెడికవర్ ఆస్పత్రి సహకారంతో సికింద్రాబాద్, రైల్ నిలయంలోని పీసీఎంఈ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన వారికి ఈసీజీ, 2డి ఎకో, బ్లడ్‌షుగర్, బీపీ వంటి అనేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఈ శిబిరానికి ఇంటర్నల్ మెడిసిన్ డాక్టర్ రాజేష్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ సాకేత్, ఆర్థోపెడిక్ డాక్టర్ సుమన్, యూరాలజిస్ట్ డాక్టర్ జ్యోతి స్వరూప్, ఆస్పత్రి జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్న ఈ వైద్య శిబిరాన్ని 350 మంది ఉద్యోగులు సద్వినియోగం చేసుకొన్నారు.

ఘనంగా బాప్టిస్ట్ చర్చి గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): లాలాగూడ బాప్టిస్ట్ చర్చ్ 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకున్నారు. నేటికి యాభై ఏళ్లు పూర్తి చేసుకోవడంతో నెల రోజుల పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాలు, క్రికెట్ టోర్నమెంట్ నిరుపేదలకు ఆర్థిక సహాయం, స్కూల్ రీట్రీట్ యూత్ రీట్రీట్ కార్యక్రమాలు వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా కాపరి రేవ పాస్టర్ కే.సుమంత్ కుమార్, రేవ ఫేప్సీబా సుమంత్ కుమార్‌ల ప్రార్థన సహకారంతో అతిథి ప్రసంగికులు పాస్టర్ జి.ప్రసాద్, పాస్టర్ బి.జర్మయ్య, రేవ పాస్టర్ సుమత్ కుమార్, ఏసుక్రీస్తు సువార్తలను ప్రసంగించారు. సంఘం ఆఫీస్ బేరర్స్ దేవదాసు, సత్యానందం, దేవదాసు నర్సింహ, ఆనంద్, పరంజ్యోతి, అబ్రహ్మం, మోసెస్ సాంసన్, డేవిడ్ లూథర్, సునీల్ ప్రేమ్ కుమార్, జెమ్స్, విద్యాసాగర్ ఉపేందర్, డేవిడ్‌లు పాల్గొన్నారు.

రైల్వేలో 62మంది ఉద్యోగ విరమణ

చిలకలగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 62 మంది ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ చేశారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు విధులు నిర్వహించారు. రైల్ నిలయంలో సీనియర్ సెక్షన్ ఆఫీసర్ హరిప్రసాద్, లేఖాభవన్‌లో ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ అకౌంట్స్ ఇస్మాయిల్, లాలాగూడ వర్క్ షాపులో కోసి జార్జ్‌లను తోటి ఉద్యోగులు శాలువ, జ్ఞాపికతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకి రావలసిన బకాయిలు బాంక్ ఖాతల్లో జమ చేయటానికి చర్యలు చేపట్టి, వారి వచ్చే పెన్షన్ వివరాలు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకి అందజేశారు. పదవీ వరమణ చేసిన ఉద్యోగులకి ఆత్మీయ వీడ్కోలు పలుకుతు సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు సందడిగా మారాయి.


లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు

కూలీల అడ్డా వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి : సుమతి

అడ్డగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో కూలీల అడ్డా చౌరస్తాలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో మహిళా కూలీలు ఇబ్బందులు పడుతున్నారంటూ యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ సుమతితో పాటు అంబేడ్కర్‌నగర్ బస్తీ కమిటీ సభ్యులు అంజయ్య, బాలనర్సింహ మంగళవారం లేబర్ కమిషనర్ గంగాధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట, తుకారాంగేట్ అంబేడ్కర్‌నగర్ బస్తీ సమీపంలోని భవన నిర్మాణ రంగంలో పనిచేయడానికి ఉదయాన్నే అడ్డా కూలీల చౌరస్తాకు వస్తారని, స్థానికంగా తాగేందుకు నీళ్లు లేవని, మహిళలకు మరుగుదొడ్లు సౌకర్యం లేకపోవడంతో మహిళా కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారంటూ వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని సంస్థ ప్రత్యేకంగా డిమాండు చేశారు.

ప్రయాణికుడికి నగల బ్యాగును అందజేసిన రైల్వే పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైలులో పోగొట్టుకున్న నగల బ్యాగును తిరిగి ప్రయాణికుడికి సికింద్రాబాద్ జీఆర్‌పి, ఆర్పీఎఫ్ పోలీసులు వెతికి పట్టి బాధితుడికి ఇప్పించారు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల.. ప్రకారం విశాఖపట్నం తినికెళ్లకు చెందిన ప్రణవ్ విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు విశాఖపట్నం రైలులో ప్రయాణం చేశాడు. సికింద్రాబాద్ స్టేషన్‌కు రాగానే తన వద్ద ఉన్న రెండు లక్షల విలువ చేసే బంగారు నగలు, ఇతర ఐడీ కార్డులకు సంబంధించిన బ్యాగు కనిపించకపోవడంతో బాధితుడు ప్రణవ్ వెంటనే జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్రమత్తమైన డ్యూటీ ఆఫీసర్ అశోక్ సింగ్ ప్రసాద్ వెంటనే అదే రైలు బోగిలో బి-14లో ఉన్న నగల బ్యాగును కనిపించడంతో సదరు ప్రయాణికుడికి జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు నగల బాగును అప్పగించారు.

నకిలీ రైల్వే ఈ టికెట్లను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వంత ఐడీ ద్వారా నకిలీ రైల్వే ఈ టికెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని హైదరాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే టికెట్ల కేంద్రం వద్ద నకిలీ రైల్వే ఈ టికెట్లను కొందరు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న హైద్రాబాద్ ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ శ్యాంసుందర్‌రావు, కానిస్టేబుల్ భరత్ కుమార్ రాములు మాటు వేసి నకిలీ రైల్వే ఈ టికెట్లను వ్యక్తిని అదుపులోకి తీసకున్నారు. ఇతని వద్ద నుంచి ఇప్పటివరకు నకిలీ ఈ టికెట్లను విక్రయించిన రూ.38.957 లక్షల విలువ చేసే రైల్వే ఈ టికెట్లను విక్రయించినట్లు విచారణలో తేలింది. ఈ వ్యక్తిని హైద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి రెండురోజులు జైలుశిక్ష

బౌద్ధనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ప్రజలకు ఆటంకం కలిగిస్తూ న్యూసెన్స్ చేసిన సంఘటనలో ముగ్గురికి రెండురోజుల పాటు జైలుశిక్ష పడిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం చిలకలగూడకు చెందిన ఎం.శివ(28), వి.శంకర్(28), ఎం.సాయికృష్ణ(26)లు ఆదివారం రాత్రి స్థానికంగా మద్యంమత్తులో హంగామా చేశారు.

దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముగ్గురిపై ఈ-పెట్టి కేసును నమోదుచేసి సోమవారం సికింద్రాబాద్‌లోని పదిహేనవ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చారు. మేజిస్ట్రేట్ కె.రవిశంకర్ ముగ్గురికి రెండురోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.